# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 052

పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం

ఫిబ్రవరి 04, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## అధికారికంగా సామాజిక న్యాయ దినోత్సవం

☐ వరంగల్ కలెక్టరేట్ లో నిర్వహణ

8లో..






8లో..

## తిరుగువారం రోజున భక్తుల రద్దీ

వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం



8లో..

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- పలు పనులకు శంకుస్థాపనలు




2లో..

## సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యం

- ధర్మసాగర్ లో ఘనంగా సామాజిక న్యాయ దినోత్సవం
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

# పోటాపోటీ




- జోరు పెంచిన పార్టీలు
- మునిసిపోల్స్ పై ప్రత్యేక దృష్టి
- రంగంలోకి అధినేతలు
- మందీ మార్బలంతో వార్డుల్లో విస్తృత ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మిలాఖత్




మునిసిపల్ ఎన్నికలకు మరో వారం రోజులు మాత్రమే గడువున్నందున అన్ని పార్టీలు ప్రచారంలో స్పీడ్ పెంచాయి. పార్టీ గుర్తులతో జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎలాగైనా తమ సత్తా చాటాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ మద్దతుదారుల తరపున ప్రచారాలను ముమ్మరం చేశాయి. పార్టీ ముఖ్యనేతలు రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. స్థానికంగా ప్రచార బాధ్యతలను ఇంచార్జులకు అప్పగించారు. ఇప్పటికే పోటీ చేస్తున్న అభ్యర్థులు పూర్తిగా ప్రజా క్షేత్రంలోనే గడుపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లతో మిలాఖత్ అవుతున్నారు. తమ పార్టీ గెలువడంద్వారా ఒనగూరే ప్రయోజనాలను వివరిస్తున్నారు. మందీ మార్బలంతో వార్డుల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. 'అధికార పార్టీకి ఓటేద్దాం - అభివృద్ధికి బాటలు వేద్దాం' అంటూ అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తుండగా 'అధైర్య పడొద్దు.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే' అంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. అయితే అభివృద్ధిని కోరుకునేవారు బీజేపీకి ఓటు వేయాలంటూ ఆ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. కాగా ఈ నెల 11న మునిసిపాలిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..

# పోటాపోటీ

- జోరు పెంచిన పార్టీలు
- మునిసిపోల్స్ పై ప్రత్యేక దృష్టి
- రంగంలోకి అధినేతలు
- మందీ మార్బలంతో వార్డుల్లో విస్తృత ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మిలాఖత్



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** మునిసిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో బీఆర్ఎస్, బీజేపీలు సై అంటే సై అంటున్నాయి. విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే పార్టీ అభ్యర్థులకు బీ–ఫారాల పంపిణీ కూడా పూర్తి కావడంతో కదన రంగానికి కాలుదువ్వుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహిస్తుండగా, బీఆర్ఎస్ అభ్యర్థులు పక్షాన ఆ పార్టీ కార్యనిర్వహణాధికి కేటీఆర్ రంగంలోకి దిగారు. తెలంగాణలో బీజేపీ సత్తా చాటేందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. ఒకవైపు మందీ మార్బలంతో వార్డుల్లో తిరుగుతూ ఇంటింటి ప్రచారాలు చేస్తుండగా మరోవైపు ముఖ్యనేతలతో కలిసి బహిరంగ సభలు, గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

### ముమ్మర ప్రచారం..

ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీల అభ్యర్థులు నువ్వా.. నేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. ఒకరికి మించి మరొకరు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలతో తమ సత్తా చాటుతున్నారు. దాదాపు 14 గంటల పాటు ప్రజాక్షేత్రంలోనే గడుపుతున్నారు. ఉదయం ఆరు గంటలకే ప్రజల్లోకి వెళుతున్న నాయకులు రాత్రి పదింటికి గాని ఇళ్లు చేరడం లేదు. అల్పాహారం మొదలుకొని రాత్రి భోజనం వరకు ప్రజలతోనే కానిస్తున్నారు. తమను గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారో ఓటర్లకు వివరిస్తున్నారు. మందీమార్బలంతో నాయకులు, కార్య కర్తలు ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకుంటూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

### తప్పని తిప్పలు..

అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీలకు రెబల్స్ బెడద తప్పేలా లేదు. పార్టీ టికెట్ ఆశ పెట్టుకున్న వారు ఇప్పటికే నామినేషన్లు వేశారు. అయితే పార్టీ పెద్దలు కొందరిని ఒప్పించి విత్ డ్రా చేసుకునేలా ప్రోత్సహించినా మరి కొందరు ససేమిరా అనడంతో సొంత పార్టీలోనే వేరు కుంపటులు మొదలయ్యాయి. అయితే వీరిని ఎలాగైనా ఒప్పించి పార్టీ ఓట్లు చీలకుండే చేసే బాధ్యతలను ఇంచార్జులకు అప్పగించారు. దీంతో బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది.




### 12 మున్సిపాలిటీలు..

ఈ నెల 11న నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థులు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 12 మున్సిపాలిటీలుండగా మొత్తం 260 వార్డులకుగాను 2,630 మంది నామినేషన్లు వేశారు. సరైన వివరాలు లేకపోవడంతో స్కృటినీలో కొన్ని పోగా పోటీనుంచి మరి కొందరు విరమించుకోవడంతో 1,077మంది బరిలో నిలిచారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో 36 వార్డులకు గాను 155 మంది పోటీ పడుతున్నారు. అదే విధంగా జనగామలో 30 వార్డులకు 127 మంది, భూపాలపల్లిలో 30 వార్డులకు 107, నర్సంపేటలో 30 వార్డులకు 120, పరకాలలో 22 వార్డులకు 100, ములుగులో 20 వార్డులకు 83, స్టేషన్ ఘనపూర్ లో 18 వార్డులకు 82, తొర్రూర్ లో 16 వార్డులకు 63, కేసముద్రంలో 16 వార్డులకు 63, డోర్నకల్ లో 15 వార్డులకు 64, మరిపెడలో 15 వార్డులకు 63, వర్ధన్నపేటలో 12 వార్డులకు 50 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.




## స్కూల్ బ్యాగుల పంపిణీ

**వరంగల్ వాయిస్, దామెర :** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు పల్లెపాడు దామోదర్ అన్నారు. బుధవారం దామెర మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్ బుక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ రాజేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## మహిళా న్యాయవాది హత్య అమానవీయం

- తీవ్రంగా ఖండించిన న్యాయవాదుల ఫోరమ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు చెందిన న్యాయవాది స్వప్న హత్య దారుణమని, ఇది అనాగరికమైన, అమానవీయమైన చర్య అని తెలంగాణ ఉద్యమ న్యాయవాదుల ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ వోడపల్లి శ్యామ్ కృష్ణ, కో కన్వీనర్ అనుముల రమేష్, వరంగల్ ఇంచార్జి రామగిరి ప్రభాకర్, కో కన్వీనర్లు రఫీ, కొంగరి రాజు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఈ రకమైన హింస చట్టపరమైన రాజ్యాంగంలోని న్యాయవ్యవస్థ పునాది మీద జరిగిన దాడి అని ఆరోపించారు. స్వప్న కుటుంబ సభ్యులకు తెలంగాణ ఉద్యమ న్యాయవాదుల ఫోరమ్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఈ అనూహ్యమైన బాధాకరమైన సమయంలో మేము వారికి సంఘీభావంగా నిలుస్తామని ప్రకటించారు. దీనిపై సమగ్రమైన, నిష్పాక్షికమైన దర్యాప్తు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టులలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

## సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యం

- ధర్మసాగర్ లో ఘనంగా సామాజిక న్యాయ దినోత్సవం
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రతి సామాజిక వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమారంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం (ధర్మసాగర్)లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక న్యాయ దినోత్సవంలో కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ లక్ష్య సాధనలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యా సంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, హసన్ పర్తి తహసిల్దార్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, వసతి గృహ వార్డెన్ ప్రియాంక, అధ్యాపకులు, కళాశాల వసతిగృహం విద్యార్థినులు పాల్గొన్నారు.

## భౌగోళిక గుర్తింపుపై అవగాహన

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, నోయిడా, ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్, టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, హ్యాండ్లూమ్స్ అభివృద్ధి కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో భౌగోళిక గుర్తింపు (గ్లోబల్ ఐడెంటిటీ–జీఐ) యూజర్ అధికరణ శిబిరంను బుధవారం కొత్తవాడలోని పద్మశాలి ట్రస్ట్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రీజినల్ ఇంచార్జి, హైదరాబాద్ ఎస్. గణేశా, సీఈఓ, జీఐ టాగ్, బెంగళూరు తేజస్ ఎస్.జె., రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, వరంగల్ కె.జయరావు, వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు విచ్చేశారు.




ఈ సందర్భంగా స్థానిక చేనేత కార్మికులకు భౌగోళిక సూచిక సర్టిఫికేట్ పొందడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడంతోపాటు నమోదు ప్రక్రియలో వారికి మార్గదర్శనం చేశారు. జీఐ సర్టిఫికేషన్ ద్వారా 'వరంగల్ దర్రీలు' వంటి సంప్రదాయ హ్యాండ్లూమ్ ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు, మార్కెట్ విస్తరణ, లాభదాయకతను పొందగలుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన అధికారులు, జీఐ బ్రాండ్ ప్రాంతానికి బ్రాండ్ విలువను పెంచడమే కాకుండా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి తోడ్పడుతుందని, ఎగుమతులను పెంచుతుందని, హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు విలువను జోడిస్తుందని పేర్కొన్నారు. జీఐ సర్టిఫికేషన్ ద్వారా కళాకారులను శక్తివంతం చేయడంతో పాటు సంప్రదాయాలుతో కూడిన విలువలు నేతదారుల పద్ధతులను రక్షించడం, అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలను సృష్టించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం వరంగల్ దర్రీల గుర్తింపును బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచిందన్నారు. స్థానిక నేతదారుల కళాత్మకతకు ప్రపంచ వేదికపై తగిన గుర్తింపు లభించేలా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత మరియు జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.శ్రీకాంత్ రెడ్డి, డీఎంఓ, టెస్కో బి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ పుగులేంటి, డెవలప్మెంట్ ఆఫీసర్ బి.సునీత, హ్యాండిక్రాఫ్ట్ ప్రమోషన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, కోఆపరేటివ్ సొసైటీ అసోసియేషన్ అధ్యక్షుడు పంతగాని శ్రీనివాస్, పద్మశాలి ఫంక్షన్ హాల్ అధ్యక్షుడు యెల్లగం చిన్న కొమరయ్య, మాజీ అప్కో డైరెక్టర్ డీఎస్. మూర్తితో పాటుగా చేనేత/మాక్స్ సంఘాల అధ్యక్షులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు.



# సామాజిక వివక్షను ప్రశ్నించడమే విద్యార్థుల కర్తవ్యం

■ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం




**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** భారతీయ సమాజంలో పాతుకుపోయిన సామాజిక వివక్షను ప్రశ్నిస్తూ, అణచివేతకు గురైన వర్గాలను జాగృతం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.వి.రామచంద్రం పిలుపునిచ్చారు. బుధవారం కేయూలోని రాజనీతి శాస్త్ర సెమినార్ హాల్‌లో బీసీ సెల్ డైరెక్టర్ డా.బి.సతీష్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వ మొదటి "తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొ.రామచంద్రం మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగుతున్న పోరాటంలో ఇదొక మైలురాయి అని పేర్కొన్నారు. 2023 ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం కుల గణనను నిర్వహించి, ఎస్సీ ఉప-వర్గీకరణపై ఏకసభ్య న్యాయ కమిషన్‌ను నియమించింది. గత ఏడాది ఫిబ్రవరి 4న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ద్వారా కుల గణన, ఎస్సీ ఉప-వర్గీకరణ తీర్మానాలను ఆమోదించిన సందర్భంగా ఈ రోజును సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు ఆయన వివరించారు. జ్యోతిరావు పూలే దంపతులు, డా.బీఆర్. అంబేద్కర్, పెరియార్ వంటి మహనీయుల నుంచి నేటి మంద కృష్ణ మాదిగ వరకు అట్టడుగు వర్గాల విముక్తి కోసం పోరాడారని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అందిపుచ్చుకుంటూ సామాజిక సమానత్వం కోసం విద్యార్థులు గళమెత్తాలని సూచించారు.మరో అతిథి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ.కట్ల రాజేందర్ మాట్లాడుతూ, సమాజంలో సగానికి పైగా ఉన్న బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు వివక్ష లేకుండా అందడమే నిజమైన సామాజిక న్యాయమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు డా.చిర్ర రాజు, విభాగాధిపతులు డా.సంకినేని వెంకటయ్య, డా.మామిడి లింగయ్య, బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.గడ్డం కృష్ణ, డా.సదాశివుడు, టీ.వెంకటేష్, డా.సాదు రాజేష్, డా.వెంకట్ గోపీనాథ్ తదితర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అరూరి రమేష్ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్ధన్నపేట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు హోరెత్తించాయి. బుధవారం 9, 10, 11 వార్డుల్లోని అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 9వ వార్డు అభ్యర్థి సింగరబోయిన రమా - రాజశేఖర్, 10వ వార్డు అభ్యర్థి తుమ్మల అరుణ - శ్రీధర్, 11వ వార్డు అభ్యర్థి సిలువేరు కుమారస్వామిలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ వార్డుల్లోని ప్రతి ఇంటినీ సందర్శించి, కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభ్యర్థులకు మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు.

# పూలే, అంబేద్కర్, సేవారత్న అవార్డుల దరఖాస్తులకు ఆహ్వానం

బీఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ ఐలయ్య



**వరంగల్ వాయిస్, రేగొండ :** వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) ఇచ్చే ప్రతిష్టాత్మక జాతీయ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు తాటికంటి ఐలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని మహాత్మ జ్యోతిరావు పూలే, డా.బీఆర్.అంబేద్కర్ అవార్డులు, ఏపీజే అబ్దుల్ కలాం సేవారత్న, సాహిత్య రత్న, ఉత్తమ సర్పంచ్, విద్యారత్న, ఉమెన్ లీడర్‌షిప్ అవార్డులకు ఎంపిక చేయనున్నారు. వచ్చే నెల 15న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించనున్న అకాడమీ 18వ జాతీయ మహాసభల్లో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు పాల్గొంటారని ఐలయ్య వివరించారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా ఈ పురస్కారాల అందజేత ఉంటుంది. సామాజిక సేవ, పరిపాలన, విద్య, కళలు, గ్రామీణ అభివృద్ధిలో విశేష కృషి చేసిన వారు అర్హులు కాగా, ఆసక్తి గల వారు ఫిబ్రవరి చివరి వరకు తమ బయోడేటాను పంపాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 9951771712 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. యువత మరియు సమాజ సేవకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా అధ్యక్షులు పిలుపునిచ్చారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఐఎఫ్టీయూ పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ పిలుపునిచ్చింది. బుధవారం రంగసాయిపేట సెంటర్, గవిచర్ల క్రాస్ వద్ద సమ్మె పోస్టర్‌ను ఐఎఫ్టీయూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగుల దయాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను, కార్మికుల శ్రమను టాటా, బిర్లా, అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. వందల ఏళ్ల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి, కార్మిక వర్గాన్ని హక్కులు లేని కట్టుబానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంటులో మందబలంతో చట్టాలను మార్చివేస్తూ, పెట్టుబడిదారుల ప్రయోజనాలే పరమావధిగా మోదీ పాలన సాగుతోందని ఆరోపించారు. సమ్మె సన్నాహకాల్లో భాగంగా ఫిబ్రవరి 6న వరంగల్‌లో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోరాటంలో కార్మికులతో పాటు రైతాంగం కూడా కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్కేఎం నాయకులు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, నగర కార్యదర్శి బన్న నర్సింగం, నగర అధ్యక్షులు ఈ.జయబాబు, కామ్రేడ్ సాంబయ్య, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కో-ఆర్డినేటర్ కల్లూరి పవన్ ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు.మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే స్థానిక ప్రాంతాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పవన్ విజ్ఞప్తి చేశారు.

# తండాల్లో రజిత రమేష్ ముమ్మర ప్రచారం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 4వ వార్డు బీజేపీ అభ్యర్థి రజిత రమేష్ గెలుపును కాంక్షిస్తూ వార్డు ఇంచార్జ్ జడ సతీష్ ఆధ్వర్యంలో బుధవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. దుబ్బ తండా, టీకే తండా, భవానికుంట తండా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ 'కమలం' పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గుజ్జ సత్యనారాయణ, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, కుందూరు మహేందర్ రెడ్డి, పంజా వెంకటేశ్వర్లు, బూత్ కన్వీనర్ ఆంగోత్ దేవేందర్, భూక్యా శ్రీనివాస్, నునావత్ సుమన్, జాటోతు సుమన్, బాబూలాల్, నవీన్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ కోసం బుధవారం పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను అధికారికంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జనరల్ అబ్జర్వర్ కిల్లు శివకుమార్ నాయుడు సమక్షంలో ఈ ప్రక్రియ పారదర్శకంగా సాగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో నిర్వహించిన ఈ ప్రక్రియ ద్వారా మొత్తం 400 మంది సిబ్బందిని విధులకు కేటాయించారు. ప్రిసైడింగ్ అధికారులు 80 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 80 మంది, ఇతర పోలింగ్ అధికారులు 240 మందికి తమ విధులను అప్పగించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా, ఏ ఒక్కరూ తమ సొంత ప్రాంతాల్లో విధులు నిర్వహించకుండా స్థానికేతర సిబ్బందిని ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అబ్జర్వర్ ర్యాండమైజేషన్ విధానాన్ని నిశితంగా పరిశీలించి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీఓ సుమ, డీపీఓ కల్పన, డీబీసీడీఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# రేపు అద్దె బస్సుల బంద్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అద్దె బస్సుల యజమానుల మొండివైఖరిని నిరసిస్తూ హనుమకొండ, వరంగల్-1, వరంగల్-2 డిపోల పరిధిలోని అద్దె బస్సుల డ్రైవర్లు రేపు సమ్మెకు పిలుపునిచ్చారు. గత కొంతకాలంగా డ్రైవర్లు తమ వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. నెలకు కనీసం రూ.2,600 వేతనం పెంచాలని కోరుతున్నారు. యజమానులు మాత్రం కేవలం రూ.1,400 మాత్రమే పెంచుతామని తెగేసి చెబుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి యజమానులతో చర్చలు జరిపారు. అయినప్పటికీ, యజమానులు తమ పంతాన్ని వీడకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. యజమానుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రేపు స్వచ్ఛందంగా బస్సులను నిలిపివేస్తున్నట్లు డ్రైవర్ల సంఘం ప్రకటించింది.

# 18వ వార్డులో బీఆర్ఎస్ జోరు



**వరంగల్ వాయిస్, పరకాల:** మున్సిపల్ ఎన్నికల వేళ పరకాల పట్టణంలోని 18వ వార్డులో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రేగూరి కరుణ విజయపాల్‌రెడ్డి బుధవారం వార్డులో నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె వార్డులోని ప్రతి గల్లీలో పర్యటించారు. ప్రచారంలో భాగంగా అభ్యర్థి కరుణ ప్రతి ఇంటిని సందర్శించి, కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వార్డు ప్రజలు ఆమెకు మంగళహారతులతో, ఆప్యాయతతో ఘనస్వాగతం పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరకాల మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు ఈ సందర్భంగా వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వార్డుల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని, అందుకే తమ ఓటు కారు గుర్తుకేనని స్థానికులు స్పష్టం చేశారు. వార్డులో పార్టీ క్యాడర్ సమన్వయంతో దూసుకుపోతుండటంతో, కరుణ విజయపాల్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం ప్రతినిధులు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీల ప్రాణాలకు రక్షణ కరువు

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, జగిత్యాల/మల్లాపూర్:** కూలీ పనులకు వెళ్లి వస్తూ ప్రమాదానికి గురై నలుగురు వ్యవసాయ కూలీలు మరణించడం అత్యంత బాధాకరమని, ఆ కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూU) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మంగళవారం పసుపు తీయడానికి వెళ్లారు. పని ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో మొగిలిపేట శివారులో వీరు ప్రయాణిస్తున్న ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ట్రాలీ కింద ఇరుక్కుపోయి మంగళ రావు లలిత, సంపంగి సాయమ్మ, పెద్దిరెడ్డి గంగు, రొడ్డ వైష్ణవి మృతి చెందగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. మృతి చెందిన నిరుపేద కూలీల కుటుంబాలకు ప్రభుత్వం రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. గాయపడిన వారికి మెరుగైన ఉచిత వైద్యం అందిస్తూనే, రూ. 1 లక్ష చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందజేయాలి. భవిష్యత్తులో కూలీల రవాణా విషయంలో ప్రమాదాలు జరగకుండా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

# పదవులు వదిలి... ప్రజాసేవకై కదిలి

## 13వ వార్డు బరిలో సువర్ణ



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** ప్రభుత్వ కొలువును వదిలి, ప్రజా సేవలో భాగస్వామి అయ్యేందుకు ఒక సామాన్య మహిళ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సువర్ణ రంగంలోకి దిగుతున్నారు. గత 20 ఏళ్లుగా ఆశా వర్కర్‌గా విశేష సేవలు అందించిన ఆమె, ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో అరంగేట్రం చేస్తూ వార్డు అభివృద్ధికి నడుం బిగించారు. సువర్ణ తన భర్త ఎల్లావుల హరికృష్ణ ప్రోత్సాహంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా ఆశా వర్కర్‌గా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వైద్య సేవలు అందిస్తూ పట్టణ ప్రజల మనసులు గెలుచుకున్నానని తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి సేవ చేయాలనే ఉద్దేశంతోనే తన ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వస్తున్నట్లు పేర్కొన్నారు. తన అత్త యాదమ్మ 45ఏళ్ల క్రితం ఇదే వార్డు నుంచి వార్డ్ మెంబర్‌గా పనిచేశారని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

# పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

## ◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పిలుపు



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి, పరకాల మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 3, 4, 16 వార్డుల అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఆయన ముమ్మర ప్రచారం నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ప్రచారంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతితో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. 3వ వార్డులో పోరండ్ల మౌనిక వేణు, 4వ వార్డులో ఏకు దివ్య విద్యాసాగర్, 16వ వార్డులో బండి శ్రీధర్ అభ్యర్థులుగా కాగా వారి కోసం ఎమ్మెల్యే ప్రచారం చేశారు. గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యం వల్ల పరకాల పట్టణం అభివృద్ధిలో వెనుకబడిందని, సంక్షేమం ముసుగులో గత నాయకులు దోచుకున్నారని విమర్శించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రత్యేక డీపీఆర్ వ్యవస్థతో మంచినీటి సరఫరా, సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తూ పరకాలను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

విద్యా హబ్: పరకాలను విద్యా కేంద్రంగా మారుస్తామని, ఇందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, టాస్క్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నామని వివరించారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరణించి కూడా ఇద్దరికి చూపునిచ్చారు

## రాజేశ్వరరావు కుటుంబానికి అభినందనలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భౌతికంగా మన మధ్య లేకపోయినా, నేత్రదానం ద్వారా ఇద్దరు వ్యక్తులకు చూపునిచ్చి కీర్తిశేషులు తక్కళ్లపల్లి రాజేశ్వరరావు చిరస్మరణీయులుగా నిలిచారని తెలంగాణ నేత్ర అవయవ శరీర ధాతల వరంగల్ బాధ్యులు కొనియాడారు. హనుమకొండ రెవెన్యూ కాలనీకి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రాజేశ్వరరావు ఇటీవల కన్నుమూయగా, ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో నేత్రదానం విజయవంతంగా పూర్తయింది. బుధవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో, రాజేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రం అందజేసి వారిని ఘనంగా సన్మానించారు. విషాద సమయంలోనూ సామాజిక బాధ్యతతో స్పందించి నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యుల చొరవ అభినందనీయమని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన బంధుమిత్రులకు నేత్ర, అవయవ, శరీర దానాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఒకరి మరణం మరొకరికి జీవనదానం కావాలని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాత బంధువులు పిన్నింటి అశోకరావు, సంస్థ బాధ్యులు కొసిరెడ్డి మల్లారెడ్డి, పరికిపళ్ళ వేణు, పెండ్లి ఉపేందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, భారతి, పద్మ, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు ‘ఉత్కృష్ట పతకం’



**వరంగల్ వాయిస్: క్రైమ్ :** పోలీస్ విభాగంలో విశేష సేవలందించినందుకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక ‘ఉత్కృష్ట పతకాన్ని’ సెంట్రల్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ బుధవారం అందుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ చేతుల మీదుగా ఆయన ఈ పతకాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ డీసీపీని ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో అంకితభావం, ప్రతిభ కనబరిచే అధికారులకు ప్రభుత్వాల గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని, ఇది తోటి అధికారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 2010లో డీఎస్పీగా పోలీస్ శాఖలో అడుగుపెట్టిన రాజమహేంద్ర నాయక్, తన సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో కీలక బాధ్యతలు నిర్వహించారు. డీఎస్పీగా నెల్లూరు, వరంగల్ సీసీఎస్, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పనిచేశారు. అదనపు ఎస్పీగా 2017లో పదోన్నతి పొంది భూపాలపల్లి మరియు ఇంటెలిజెన్స్ విభాగాల్లో సేవలందించారు. ఎస్పీగా 2021లో పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అనేక క్లిష్టమైన కేసులను ఛేదించడంలో, శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు. ఆయనకు పతకం రావడం పట్ల వెస్ట్ జోన్ పోలీస్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# ‘అభ్యాస’ స్కూల్‌కు అవార్డుల పంట



**వరంగల్ వాయిస్, శంభునిపేట :** వరంగల్ జిల్లా శంభునిపేట గణేష్ నగర్‌లోని అభ్యాస స్కూల్ ప్రతిష్టాత్మక పురస్కారాలను దక్కించుకుంది. సుచరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో అభ్యాస స్కూల్‌ను ‘బెస్ట్ స్కూల్’ అవార్డు వరించింది. అదేవిధంగా విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ మిస్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ ‘బెస్ట్ స్కూల్ ప్రిన్సిపాల్’ అవార్డుకు ఎంపికయ్యారు. సర్ సి.వి. రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా ఆయనను శాలువాతో సత్కరించి అవార్డును ప్రదానం చేశారు. సుచరిండియా నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో అభ్యాస స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. హిబా ఇరామ్ (7వ తరగతి) తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. అఫ్వాన్ పీర్ దౌషి (5వ తరగతి) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో సెకండ్ లెవల్‌కు ఎంపికయ్యారు. ఈ విజేతలు నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మీర్జా నసీరుల్లా బెగ్ ప్రిన్సిపాల్‌ను, ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ అఖిల్ ఉల్లా బెగ్ మాట్లాడుతూ.. ఈ అవార్డులు తన ఒక్కరి కృషి కాదని, అభ్యాస స్కూల్ కుటుంబం అంతా ఒక టీమ్ లాగా పనిచేయడం వల్లే ఈ గౌరవం దక్కిందని ఉపాధ్యాయ బృందాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండల శిరీష, రెహమత్ మేడం, కోల రాము, ప్రియాంక, రజినీ, భారతి, ప్రణయ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నిరుద్యోగ నిర్మూలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- ప్రైవేటు శక్తులకు ప్రభుత్వ రంగాన్ని అప్పగిస్తున్న బీజేపీ
- జాబ్ క్యాలెండర్ హామీని విస్మరించిన కాంగ్రెస్
- మార్చి 7న ఏఐఎఫ్ డీవై రాష్ట్ర ప్లీనం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :**దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతున్నా, ఉద్యోగాల భర్తీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఏఐఎఫ్ డీవై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్ మండిపడ్డారు. వరంగల్ జిల్లా గిర్నిబాయిలో జరిగిన ఏఐఎఫ్ డీవై రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఏడాదికి కోటి ఉద్యోగాల హామీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ, గత 13 ఏళ్లలో ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను విచ్ఛిన్నం చేస్తూ, అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం పేరిట మోసం చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. బడ్జెట్‌లో నిరుద్యోగ నిర్మూలనకు తగిన నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సుధాకర్ పిలుపునిచ్చారు. భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు మార్చి 7న హైదరాబాద్‌లోని ఓంకార భవన్‌లో ఏఐఎఫ్ డీవై రాష్ట్ర ప్లీనం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువత, కార్యకర్తలు ఈ ప్లీనాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఏఐఎఫ్ డీవై రాష్ట్ర అధ్యక్షులు కర్ర హాసిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద రవి, సహాయ కార్యదర్శి నీల రవీందర్, కోశాధికారి డి.మధుసూదన్, కమిటీ సభ్యులు వీరమల్లు కిరణ్ పాల్గొన్నారు.

# బొగ్గు రవాణా వల్ల వరంగల్ ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది

**లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య**



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ:** వరంగల్ జిల్లాలో బొగ్గు రవాణా కారణంగా పర్యావరణం మరియు ప్రజారోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావం గురించి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ రవాణా వల్ల పెరుగుతున్న దుమ్ము కాలుష్యాన్ని అదుపు చేయడానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలేమిటో స్పష్టం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.బొగ్గు రవాణా, అనుబంధ లాజిస్టిక్స్ వల్ల వరంగల్ పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత దెబ్బతింటోందా?, దీనివల్ల ప్రజారోగ్యంపై పడే ప్రభావంపై కేంద్రం ఏదైనా అధ్యయనం నిర్వహించిందా?, దుమ్ము కాలుష్యం తగ్గించేందుకు మరియు రోడ్డు భద్రత కోసం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు? అని ప్రశ్నించారు. ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ.. వరంగల్ సమీపంలోని భూపాలపల్లి సింగరేణి గనుల నుంచి ప్రతిరోజూ సుమారు 4,000 టన్నుల బొగ్గు 56 కిలోమీటర్ల మేర ఉప్పల్ రైల్వే సైడింగ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈపీటీఆర్ఐ ద్వారా గాలి, నీరు, శబ్ద కాలుష్యంపై అధ్యయనాలు చేశామని తెలిపారు. మంత్రి సమాధానంపై ఎంపీ కడియం కావ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం సమర్పిస్తున్న నివేదికలు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు పొంతన లేవని ఆమె పేర్కొన్నారు. కేంద్రం కేవలం కాగితాలపై నివేదికలు ఇవ్వడం కాకుండా, క్షేత్రస్థాయిలో కాలుష్య నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఆమె డిమాండ్ చేశారు.

# విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్:** పాఠశాల విద్యార్థుల్లో కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, ప్రశ్నించే మనస్తత్వం, తర్కబద్ధమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే ఆధునిక విద్య అసలైన లక్ష్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ కె.బి. ధర్మ ప్రకాశ్ అన్నారు. ధర్మసాగర్ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో భాగంగా "పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన ఎందుకు అవసరం?" అనే అంశంపై ఆయన ప్రత్యేకంగా ప్రసంగించారు. సమాజంలో వేళ్లూనుకున్న అపోహలు, అంధవిశ్వాసాలను దూరం చేయడంలో శాస్త్రీయ దృక్పథం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ఇంగ్లీష్ తరగతులలో సైతం శాస్త్రీయ దృక్పథాన్ని అనుసంధానించడం ద్వారా భాషా నైపుణ్యాలతో పాటు విద్యార్థుల ఆలోచనా సామర్థ్యం మెరుగుపడుతుందని వివరించారు. ప్రాజెక్ట్ వర్క్, గ్రూప్ డిస్కషన్స్, తార్కిక చర్చల ద్వారా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను ఎలా పెంపొందించవచ్చో ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. సాక్ష్యాల ఆధారంగా నిర్ణయాలు తీసుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దడం వల్ల వారు భవిష్యత్తు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలరని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఈ సెమినార్ తమ బోధనా పద్ధతుల్లో కొత్త మార్పులు తీసుకురావడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని, తమ క్షేత్రస్థాయి అనుభవాలను పంచుకున్నారు.

# బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ

- రాష్ట్రంలోనే తొలి జిల్లాగా హనుమకొండ
- ఓటర్ల జాబితా ప్రక్షాళనే ప్రధాన లక్ష్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓటర్ల జాబితాలో పారదర్శకతను పెంపొందించే దిశగా హనుమకొండ జిల్లా సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్రంలోనే తొలిసారిగా బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని హనుమకొండ సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 244 మంది బూత్ లెవల్ ఏజెంట్లు, 26 మంది డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల సూపరింటెండెంట్ జగత్ సింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేస్తూ శిక్షణనిచ్చారు. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్న ఓట్లను గుర్తించడం. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన ఓటర్ల వివరాలను జాబితా నుండి తొలగించేందుకు చర్యలు చేపట్టడం. తాజా ఓటర్ లిస్ట్ ఆధారంగా బూత్ లెవల్ అధికారులతో (BLO) కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరిగేలా చూడటంలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర కీలకమని అధికారులు పేర్కొన్నారు. కలెక్టర్ గారి మార్గదర్శకాల మేరకు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కు ముందస్తుగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, కాజీపేట తహసీల్దారులు జి.రవీందర్ రెడ్డి, రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వీ.శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు రాజు, మానస రాంప్రసాద్, విజయలక్ష్మి సురేందర్, పలువురు డివిజన్ అధ్యక్షులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

# సర్టిఫికెట్ల జారీలో జాప్యం వద్దు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి బుధవారం శాయంపేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను సందర్శించి, రికార్డుల నిర్వహణను కూలంకషంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా భూభారతి, సాదాబైనామా దరఖాస్తులు, జాతీయ రహదారుల భూసేకరణ రికార్డులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. వీటితో పాటు మీ–సేవ సర్టిఫికెట్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల దరఖాస్తుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా, సర్టిఫికెట్లను త్వరితగతిన జారీ చేయాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌ను ఆదేశించారు. మండలానికి సంబంధించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, మ్యాపింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ అంశాలపై సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, ఎంపీడీఓ ఫణి చంద్ర, రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సోదా రామకృష్ణ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ జన్మదిన వేడుకలు బుధవారం పరకాలలో ఘనంగా జరిగాయి. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణానికి విచ్చేసిన రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమక్షంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి పి.విశ్వనాథ్, పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి సోదా రామకృష్ణ చేత కేక్ కట్ చేయించి, ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ శాసనసభ్యుడు మొలుగూరి భిక్షపతి, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, తాజా మాజీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని రామకృష్ణకి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల వేళ ఈ వేడుక పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# గోపాల్‌పూర్ గౌడ సంఘం అధ్యక్షుడిగా సదానందం గౌడ్



**వరంగల్ వాయిస్, గోపాల్‌పూర్:** హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ గౌడ సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక గౌడ కమ్యూనిటీ హాల్‌లో ఉత్సాహంగా జరిగింది. ఈ సమావేశంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా దూలం సదానందం గౌడ్, ఉపాధ్యక్షుడిగా దూలం శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా కోల రామకృష్ణ గౌడ్, డైరెక్టర్లుగా దూలం సురేందర్, కాసగోని జనార్దన్, దూలం రమేష్, చింత శ్రీనివాస్, జక్కు శ్రీనివాస్, మరియు దూలం పవన్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. నాయకుడిగా ఎన్నికైన అనంతరం దూలం సదానందం గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. గౌడ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల బాంధవులందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పూర్ గౌడ సంఘం సభ్యులు, సామాజిక వర్గ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భట్టుపల్లి గ్రామంలో బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి పడి ఓ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు పూజారి రవి రోజువారీ మాదిరిగానే కల్లు గీత కోసం తాటి చెట్టు ఎక్కారు. అయితే, చెట్టుపై పని చేస్తుండగా అకస్మాత్తుగా పట్టు తప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో రవి కాళ్లు, చేతులు, తొడ భాగాలకు తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రవిని ప్రాథమిక చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో భట్టుపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కాంగ్రెస్‌ను గద్దెదించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు, 12, 13 వార్డుల అభ్యర్థులు కొత్త వీరన్న, కొత్త రాంబాబు కోరారు. బుధవారం డోర్నకల్ పట్టణంలోని ఆయా వార్డులలో వారు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఓటర్లను అభ్యర్థించారు. రెండేళ్ల క్రితం మోసపూరిత వాగ్దానాలతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు మళ్లీ అవే అబద్ధాలతో వస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో డబ్బులు ఎరచూపి ఓట్లు కొనేందుకు ప్రయత్నిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డోర్నకల్ పట్టణ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, కారు గుర్తుకు ఓటు వేసి తమను గెలిపిస్తే వార్డుల ప్రగతికి అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించి గద్దె దించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవగాహనతో క్యాన్సర్‌ను అరికట్టొచ్చు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పుల వల్ల క్యాన్సర్ మహమ్మారి విస్తరిస్తోందని, అయితే సరైన అవగాహనతో దీనిని ప్రాథమిక దశలోనే అరికట్టవచ్చని యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ కోడిమాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే నయం చేయడం సులభం. దీనికోసం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. పోషకాహారం తీసుకోవడం, రోజూ వ్యాయామం చేయడం ద్వారా వ్యాధి ముప్పును తగ్గించవచ్చు. ఆధునిక వైద్యంలో ఎన్నో రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఎవరూ భయపడకుండా, కుటుంబ సభ్యుల సహకారంతో ధైర్యంగా పోరాడితే క్యాన్సర్ నుండి విముక్తి పొందవచ్చు. ఎంతోమంది సినీ సెలబ్రిటీలు క్యాన్సర్‌ను జయించి మన ముందు ఆదర్శంగా నిలిచారని ఆయన గుర్తుచేశారు. “2026 ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం థీమ్ ‘యునైటెడ్ బై అంటే ప్రతి రోగి అవసరాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, అందరికీ నాణ్యమైన చికిత్స అందేలా మనం ఐక్యంగా కృషి చేయాలి.” ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు స్వప్న, ఎన్ఎస్ఎస్ సీనియర్ వలంటీర్ దేవి శ్రీ ప్రసాద్, రోహిత్, రాజేష్ దీక్షిత్ తదితరులు పాల్గొని క్యాన్సర్ నివారణపై తమ గళాన్ని వినిపించారు.

# లయన్ సభ్యునిగా గర్వపడాలి

**• దీపక్ భట్టాచార్జీ**



**వరంగల్ వాయిస్, జనగామ :** సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అమోఘమని, అటువంటి సంస్థలో సభ్యులుగా ఉన్నందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏరియా లీడర్ లయన్ దీపక్ భట్టాచార్జీ అన్నారు. జనగామలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన ‘రామినివారి సిద్ధేశ్వర రీజియన్ మీట్’ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎల్ సీఐఎఫ్ తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపడుతుందని, ఈ ఫౌండేషన్‌ను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత సభ్యులపై ఉందని భట్టాచార్జీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెయ్యి డాలర్ల విరాళం ప్రకటించి ‘ప్రోగ్రెసివ్ మెల్విన్ జోన్స్’ సభ్యులుగా చేరిన రీజియన్ చైర్మన్లు రామిని శ్రీనివాసులు, చంద్రగిరి శ్రీనివాస్ లను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ పిన్‌లను ప్రదానం చేశారు. ఈ రీజియన్ మీట్‌లో ఉత్తమ సేవలు అందించిన క్లబ్‌లు, నాయకులకు అవార్డులు అందజేశారు. ఉత్తమ క్లబ్ లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం, ద్వితీయ ఉత్తమ క్లబ్ బి–బాయ్స్ క్లబ్, బెస్ట్ క్లబ్ జనగామ డైమండ్స్, ఉత్తమ అధ్యక్షులుగా లయన్ భోగ రాం దయాకర్ (సూర్య), లయన్ శివరామకృష్ణ (డైమండ్స్), బండ భిక్షపతి (మిలీనియం), కన్న శ్రీనివాస్ (బి–బాయ్స్), కారంపూడి సత్యనారాయణ (ఆబాద్) లు అందుకున్నారు. రీజియన్ ప్రథమ మహిళ లయన్ సరస్వతి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమవగా, జిల్లా గవర్నర్ లయన్ డా.చంద్రశేఖర్ ఆర్య ప్రారంభోపన్యాసం చేశారు. రీజియన్ చైర్మన్ లయన్ రామిని శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి, సెకెంట్ వైస్ జిల్లా గవర్నర్ పుట్ట హరికిషన్ రెడ్డి, పూర్వ గవర్నర్లు ముచ్చ రాజిరెడ్డి, కన్న పరశురాములు, భారీ సంఖ్యలో లయన్ సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పతనం ప్రారంభమైంది



**వరంగల్ వాయిస్, పరకాల:** బీఆర్ఎస్ పార్టీ పతనం మొదలైందని, ఆర్థిక అహంకారంతో ప్రజాస్వామ్యాన్ని ఆ పార్టీ నేతలు కూని చేస్తున్నారని పరకాల బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు తీవ్రంగా విమర్శించారు. బుధవారం పరకాల పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సంతోష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధికారంలో ఉన్నప్పుడు సంపాదించిన డబ్బుతో ఇతర పార్టీల అభ్యర్థులను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. 14వ వార్డు బీజేపీ అభ్యర్థిని బెదిరించి, ప్రలోభాలకు గురిచేసి కొనుగోలు చేయడం నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. బీజేపీ అభ్యర్థులు సిద్ధాంతాల కోసం పనిచేస్తారని, ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థులను బెదిరించడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌కు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. గతంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేల గురించి మాట్లాడిన కేటీఆర్ వ్యాఖ్యలు మాజీ ఎమ్మెల్యేకు గుర్తు లేవా అని ప్రశ్నించారు. ఓటర్లను అవమానించేలా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్‌ను గద్దె దించాలని, ప్రజాస్వామ్యం గెలవాలంటే బీజేపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనూరి మేఘనాథ్, సంఘ పురుషోత్తం, ఎరుకల దివాకర్, బాసాని సోమరాజు, చంద్రమౌళి, సల్పల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచకూట శివాలయానికి భారీ విరాళం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలోని అత్యంత ప్రాచీనమైన పంచకూట శివాలయ పునఃప్రతిష్ట కార్యక్రమాలకు దాతలు భారీ విరాళంతో తమ భక్తిని చాటుకున్నారు. బుధవారం వైనాల చంద్రమోహన్ – లత దంపతులు మరియు వైనాల కవిత – మహేశ్వర్ (ఎల్లయ్య–సుగుణల కుమారుడు) లు శివాలయాన్ని సందర్శించి పార్వతి సమేత మహాదేవ స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆలయ పునఃప్రతిష్ఠ పనుల కోసం తాము సేకరించిన రెండు లక్షల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డికి అందజేశారు. ఆలయ అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భారీ విరాళం అందజేసిన వైనాల కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాతల సహకారం ఎంతో స్ఫూర్తిదాయకమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు నాగబండి శివప్రసాద్, రేవూరి దేవేందర్ రెడ్డి, పాపని రవీందర్, సిరిపురం సంపత్, రేవూరి జయపాల్ రెడ్డి, బూర కిషోర్, గ్రామ భక్తులు పాల్గొన్నారు.

# మిత్రద్రోహి ఎమ్మెల్యేకు గుణపాఠం చెప్పండి

- తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- మానుకోటలో సీపీఐ ఎన్నికల శంఖారావం
- సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** కమ్యూనిస్టులకు మిత్రద్రోహిగా మారిన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్‌కు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం మహబూబాబాద్‌లో జరిగిన సిపిఐ ఎన్నికల ప్రచార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత శాసనసభ ఎన్నికల్లో కమ్యూనిస్టుల మద్దతుతో గెలిచి, అధికారంలోకి వచ్చాక మిత్రధర్మాన్ని విస్మరించిన ఎమ్మెల్యే తీరును శ్రీనివాసరావు తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ కమ్యూనిస్టులతో కలిసి నడుస్తుంటే, మహబూబాబాద్ ఎమ్మెల్యే మాత్రం అందుకు విరుద్ధంగా కమ్యూనిస్టులను దూరం పెడుతున్నారని విమర్శించారు. ఆయన ఒంటెద్దు పోకడల వల్ల కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు. తాము మిత్రధర్మాన్ని పాటిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తుంటే, ఎమ్మెల్యే మాత్రం మిత్రద్రోహానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. డబ్బు సంచులు, మద్యం సీసాలతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్న అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ఓటర్లను కోరారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి, మానుకోట అభివృద్ధి కోసం పోరాడే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 36వ వార్డు అభ్యర్థి పెరుగు కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, 33వ వార్డు అభ్యర్థి బి.అజయ్ సారధి రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ పాల్గొన్నారు. రేషపల్లి నవీన్ (18), చింతకుంట్ల శ్రీదేవి (22), ఎండి ఫాతిమా (21), నాగిల్లి యాకమ్మ (23), నర్ర సంధ్య (25), నర్ర శ్రావణ్ (29), చింతకుంట్ల వెంకన్న (24), వెలుగు అశ్విని (27), ఆబోతు సరళ (31) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రచారాన్ని హోరెత్తించారు.



# చిరు మూవీలో సారా అర్జున్ ?

మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ`ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.






# అవతార్ లెవల్లో వారణాసి

- పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదిరింది
- ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారు
- అత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాం
- అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పాని ప్రియాంక అన్నారు. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు విశేషాలు తెలిపారు. 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టిందని మహేశ్ బాబు అన్నారు. 'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. 'వారణాసి' లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను ఎంపిక చేయడం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ సినిమాలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత విభిన్నమైన, అంచనా వేయలేని పాత్ర అని ఆయన తెలిపారు. ఈ కుంభ క్యారెక్టర్ పూర్తిగా గ్రే షేడ్స్‌తో సాగుతుందని చెప్పారు. ఎప్పుడు ఏం చేస్తాడో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఈ పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు. తన నిజజీవితానికి పూర్తిగా భిన్నమైన డార్క్ రోల్ కావడం వల్ల ఇది తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు.

# ప్రేమలు సీక్వెల్ ఆగిపోలేదు

మలయాళ సెన్సేషనల్ హిట్ 'ప్రేమలు' చిత్రానికి సీక్వెల్ రాబోతున్న విషయం తెలిసిందే. 'ప్రేమలు 2' అంటూ ఈ సీక్వెల్ రాబోతుండగా.. తాజాగా ఈ ప్రాజెక్ట్ రద్దయిందంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తలపై చిత్రబృందం తాజాగా స్పందిస్తూ.. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా నిలిచిపోలేదని కేవలం తాత్కాలికంగా వాయిదా పడిందని స్పష్టం చేసింది. 2024 ఏప్రిల్‌లో ఎంతో గ్రాండ్‌గా ప్రకటించిన ఈ సీక్వెల్‌ను 2025లో ఏడాది విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇది 2026 సమ్మర్‌కి పోస్ట్‌పోన్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. మరోవైపు చిత్ర దర్శకుడు గిరీష్ ప్రస్తుతం మమితా బైజు, నివిన్ పాలీలతో కలిసి 'బెత్లెహెం కుటుంబ యూనిట' అనే మరో ప్రాజెక్ట్‌లో బిజీగా ఉండటం కూడా ఒక కారణమని తెలుస్తుంది. తెలుగులో ఎస్.ఎస్. కార్తికేయ ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, చిత్ర నిర్మాణ సంస్థ 'భావన స్టూడియోస' నుండి ఈ పుకార్లపై ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.





# బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది.ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది. 'ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది' అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.







# తిరుగువారం రోజున భక్తుల రద్దీ

## వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం

**వరంగల్ వాయిస్, మేడారం :** శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర తిరుగువారం సందర్భంగా బుధవారం వన దేవతల సన్నిధి భక్త జనసందోహంగా మారింది. తిరుగువారం సందర్భంగా వన దేవతల పూజారులు కన్నేపల్లి ఆలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించి వన దేవతలకు దీప దూప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల పూజ సామాగ్రి, పట్టు వస్త్రాలను పూజారులు భద్రపరిచారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తొలుత జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి వన దేవతలకు బంగారం, ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక మొత్తంలో తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతర పరిసర ప్రాంతాలలోని వ్యర్థాలను పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగిస్తూ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

### రేపు హుండీల లెక్కింపు..

మేడారం సమ్మక్క- సారలమ్మ మహా జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల లెక్కిపును గురువారం ప్రారంభించనున్నారు. మేడారంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 787 హుండీలను ఆర్టీసీకి చెందిన కార్గోలో ఇప్పటికే హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపానికి తరలించారు. కొత్తగా ఏర్పాటు చేసిన మరో 40 హుండీలను కూడా తిరుగువారం అనంతరం హనుమకొండకు తరలించనున్నారు. దీంతో మొత్తం 827 హుండీలను లెక్కించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుల వివిధ హుండీలలోని నగదు, బంగారు, వెండి, విదేశీ కరెన్సీలను వేరే చేసే ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనంతరం నగదు లెక్కించి అక్కడే బ్యాంకులో డిపాజిట్ చేయనున్నారు. ఈ ఆదాయం నుంచి పూజారులకు ప్రభుత్వం వాటా ఇవ్వనున్నారు.



## అమ్మవారిపేటలో తిరుగువారం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అమ్మవారిపేట శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర తిరుగువారం సందర్భంగా బుధవారం జాతర కమిటీ సభ్యులు తల్లులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. తల్లుల ఆశీర్వాదాలతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడు భక్తులు తల్లులను దర్శనం చేసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ ఆర్గనైజర్ దాసి రాందేవ్, కార్యదర్శి బైరి నాగరాజు, సహాయ కార్యదర్శి బైరి హరినాథ్, ప్రచార కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, ధర్మకర్త ఆవునూరు సంతోష్, పూజారి బైరి కిరణ్, అభివృద్ధి కమిటీ సభ్యులు ఆవునూరు సతీష్, కరుణాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారికంగా సామాజిక న్యాయ దినోత్సవం

☐ వరంగల్ కలెక్టరేట్ లో నిర్వహణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** దివ్యాంగులు, నిరుపేదలందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, వృద్ధులకు న్యాయం, సేవా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. రాష్ట్ర సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులతో సామాజిక న్యాయ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ఫిబ్రవరి 4, 2025న రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించిందని తెలిపారు. సామాజిక న్యాయం అనేది వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ నుంచే అలవాటుగా మారాలనే ఉద్దేశంతో ఈ రోజున పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి భంగం కలగకుండా ఉండేందుకే కమిషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, డిబిసిడిఓ పుష్పలత, ఆర్డీవో సుమ, జిల్లా అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

### మీడియా సెంటర్ ప్రారంభం..

మునిసిపల్ ఎన్నికలను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని డీపీఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఆర్ఓ ఆయుబ్ అలీ, ఆర్డీఓ సుమా, డీపీఓ కల్పన, డీబీసీడీఓ పుష్పలత, ఆదనవు పీఆర్ఓ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- పలు పనులకు శంకుస్థాపనలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో మంత్రి కొండా సురేఖ బుధవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా 13వ డివిజన్ పరిధిలోని ఎల్‌బీ నగర్ లో నిర్మించనున్న ఉర్దూ ఘర్, షాదీఖానా పనులను ప్రారంభించి, మైనారిటీ వర్గాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

అలాగే ఖిలా వరంగల్ 36వ డివిజన్ పరిధిలోని చింతల్ ఈద్గా వద్ద చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఖిలా వరంగల్ 41వ డివిజన్ లోని శంభునిపేట మైనారిటీ కాలనీ, పూర్ణోదయ కాలనీల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించటం ద్వారా కాలనీల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చేందుకు కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పేదల సమస్యలు మానవత దృక్పథంతో అధికారులు పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి సురేఖ తెలిపారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వరంగల్ జిల్లాను అభివృద్ధిలో ముందువరుసలో నిలుపుతామన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com